సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

బుధవారం | 3 | సెప్టెంబర్ | 2025



గంజాయి పట్టివేత

ఖానాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిలుకలగుట్ట దగ్గర రూ.3.81 కోట్ల విలువైన 763 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు సీపీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. - 8లో▸



మంత్రుల కాన్వాయ్ అడ్డగింత

కాళేశ్వరం ప్రాజెక్టు విచారణను సీబీఐకి అప్పగించడాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్ నేతలు మంత్రుల కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
28^0/23^0

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జెడ్పీ సీఈఓకు పదోన్నతి



హన్మకొండ: హనుమకొండ జెడ్పీ సీఈఓ ఎం.విద్యాలతకు ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి కల్పించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీరాజ్, గ్రామీణ ఉపాధి డైరెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ఈ మేరకు విద్యాలత మంగళవారం హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ స్నేహ శబరీష్, డీఆర్‌డీఓ మేన శ్రీను అమెను అభినందించారు. జెడ్పీ డిప్యూటీ సీఈఓ బి.రవి, కార్యాలయ పర్యవేక్షకులు రవిప్రకాశ్, సునీల్, ఉద్యోగులు నవీన్, గోపాల్‌సింగ్, వేణుగోపాల్, నాలుగో తరగతి ఉద్యోగులు సీఈఓను కలిసి అభినందనలు తెలిపారు.

విద్యారంగ సమస్యలపై కలెక్టరేట్ ముట్టడి



హన్మకొండ అర్బన్ : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించి, అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పట్టించుకోవడంలో పూర్తి విఫలమైందన్నారు. రాష్ట్రంలో రూ.8 వేల కోట్ల స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అదేవిధంగా పెండింగ్ ఉన్న మెస్, కాస్మొటిక్ చార్జీలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులను పోలీసులు అరెస్టు చేసి సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు బొచ్చు కల్యాణ్, బిరెడ్డి జశ్వంత్, అనూష, పరిమళ, బొచ్చు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళికి ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ పూజలు



హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య దంపతులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ పర్యవేక్షకుడు క్రాంతికుమార్, అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అర్చకులు వారికి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేశారు.

లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి : డీఎంహెచ్‌ఓ

ఎంజీఎం: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సబ్ సెంటర్ల సిబ్బంది పనిచేయాలని హనుమకొండ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య సూచించారు. ఆశ డే సందర్భంగా 8 ఆరోగ్య కేంద్రాల పరిధిలో నమోదవుతున్న జ్వరాలు, డెంగీ పాజిటివ్ కేసులు, ఫీవర్ సర్వే, వైద్య శిబిరాల నిర్వహణ, ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా నిర్వహిస్తున్న స్క్రీనింగ్, ఎక్స్‌రే పరీక్షలను ఉప కేంద్రాల వారీగా మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ అప్పయ్య మాట్లాడుతూ పరీక్షలు, ఎక్స్‌రేలను ఇంకా ఎక్కువ సంఖ్యలో నిర్వహించాలని, పీహెచ్‌సీల్లో మందులు, టెస్టింగ్ కిట్ల లభ్యత ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ మదన్మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయకుమార్, డెమో అశోక్‌రెడ్డి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లకే పరిమితం

- సమస్యల పరిష్కారానికి చొరవచూపని వార్డు ఆఫీసర్లు
- పట్టించుకోని జీడబ్ల్యూఎంసీ పాలకవర్గం, అధికారులు
- ఇబ్బందులు పడుతున్న గ్రేటర్‌లోని 66 డివిజన్ల ప్రజలు



వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వార్డు (డివిజన్) ఆఫీసర్ల పాలన గాడి తప్పింది. అన్ని విభాగాల అధికారులు, సిబ్బందికి సమన్వయకర్తలుగా వ్యవహరించాల్సిన వార్డు ఆఫీసర్లు తమ బాధ్యతలను విస్మరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దిశానిర్దేశం చేయాల్సిన అధికారులు ఏం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో వార్డు ఆఫీసర్లు కేవలం పన్నుల వసూళ్లు, సంక్షేమ పథకాలకే పరిమితమయ్యారు. వార్డు ఆఫీసర్ పాలన లక్ష్యం గ్రేటర్ వరంగల్‌లో నెరవేరడం లేదు.

66 డివిజన్లకు 66 మంది..

వార్డు పరిపాలనను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం రెండేళ్ల క్రితం సిబ్బందిని నియమించింది. రెవెన్యూ శాఖకు చెందిన 38 మంది వీఆర్‌ఏలను పురపాలక శాఖలో విలీనం చేసింది. వీరితోపాటు బల్దియాలోని 36 మంది పర్మనెంట్ ఉద్యోగులు బిల్ కలెక్టర్లు, వివిధ విభాగాలకు చెందిన వారిని గుర్తించారు. 66 డివిజన్లకు 66 మంది వార్డు ఆఫీసర్లను, 8 మందిని మీ సేవ కేంద్రాల్లో క్యాషియర్లుగా నియమించారు. అంతేకాకుండా 9నెలల క్రితం మరో 25 మందిని వార్డు ఆఫీసర్లను ప్రభుత్వం బల్దియాకు కేటాయించింది. వీరిలో 23 మందికి టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన, అప్‌లోడ్ బాధ్యతలు అప్పగించారు.

కొరవడిన పర్యవేక్షణ..

వార్డు ఆఫీసర్లపై బల్దియా ఉన్నతాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 15 రోజులు, నెలవారీ వారీగా డిప్యూటీ కమిషనర్లు, అడిషనల్ కమిషనర్ సమీక్షించి సమస్యలపై పరిష్కార మార్గాలు సూచించాలి. కానీ, అవేమి అమలు కాకపోవడంతో వార్డు ఆఫీసర్లు ఇష్టారాజ్యంగా విధులు నిర్వర్తిస్తున్నారని నగర ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జీడబ్ల్యూఎంసీ పాలకవర్గం, ఉన్నతాధికారులు స్పందించి వార్డు ఆఫీసర్ల పాలనను గాడిలో పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఏం చేయాలి?

మేయర్, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల దృష్టికి రాని అనేక సమస్యలు క్షేత్రస్థాయిలో ఉత్పన్నమవుతుంటాయి. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషిచేయాలి. పౌర సేవల పట్టిక అమలు కోసం పనిచేయాల్సి ఉంటుంది. అధికారుల దృష్టికి వచ్చే ఫిర్యాదులే కాకుండా సామాజిక మధ్యమాలు, కంట్రోల్ రూం, టోల్‌ఫ్రీ నంబర్ ఫిర్యాదులపై స్పందించాలి. ఆస్తి, నీటి, గార్బేజ్ చార్జీలు, ట్రేడ్ లైసెన్స్ పన్నులు వసూలు చేయాలి. జనన, మరణ ధ్రువపత్రాల జారీకి విచారణ చేయాలి. రోడ్లపై గుంతలు, నీటినిల్వలు, మట్టి కుప్పలు, మూతల్లేని మ్యాన్‌హోళ్లు, ఫుట్‌పాత్ కబ్జాలు, వెలగని వీధి లైట్లు, ఇంటింట చెత్త సేకరణ తీరు, ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ, నాలాలు, డ్రెయినేజీల్లో వ్యర్థాలు పేరుకుపోవడం, దోమల సమస్య, జంతు, పక్షుల కళేబరాలు, దివ్యాంగులు, వృద్ధులకు గుర్తింపు కార్డులు తదితర సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకోవాలి. అనధికారి భవన నిర్మాణాలు, ప్రభుత్వ స్థలాల కబ్జాలు, అక్రమంగా వెలిసిన ఫ్లెక్సీలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై విచారణ, పురోగతిపై దృష్టిసారించాలి. ఆయా విభాగాలకు చెందిన ఏఈలు, ఆర్‌ఐలు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, డివిజన్ల సిబ్బంది, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలి.

ఏం చేస్తున్నారు?

వార్డు ఆఫీసర్లు ఆస్తి, నీటి, గార్బేజ్ చార్జీలను అరకొరగా వసూలు చేస్తున్నారు. దీనికి కూడా బిల్ కలెక్టర్ల సహకారం తీసుకుంటున్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే, పురోగతి, గృహలక్ష్మి, పెన్షన్ల కోసం లబ్ధిదారుల విచారణ చేసి చేతులు దులుపుకుంటున్నారు. వార్డు ఆఫీసర్ పాలనకు సంబంధించిన ఇతర పనులపై ఏ మాత్రం చొరవ తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఆయా వార్డుల్లో సమస్యలు ఎక్కడికక్కడే పేరుకుపోతున్నాయి. ప్రభుత్వం నుంచి వేతనాలు పొందుతూ నామామాత్రంగా విధులు నిర్వర్తిస్తూ కాలక్షేపం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని విజయ గణపతి కాలనీకి చెందిన దండ వెంకట్‌రావు, అతని భార్య రజిత అలియాస్ రాణిలు కొంతకాలంగా వ్యభిచార గృహం నిర్వహిస్తున్నారు. పోలీసులు మంగళవారం ఆ ఇంటిపై దాడులు చేసి నిర్వాహకులతోపాటు విటుడిని అరెస్ట్ చేశారు. ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

టూరిజం స్పాట్‌గా ఉర్సు రంగసముద్రం

- ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- వరంగల్ కలెక్టర్ సత్యశారద

న్యూశాయంపేట: వరంగల్ నగరంలోని ఉర్సు రంగసముద్రం చెరువును టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద.. అధికారులను ఆదేశించారు. మంగళవారం కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, బల్దియా కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి తదితర అధికారులతో కలిసి ఉర్సుగుట్ట రంగసముద్రం చెరువును పరిశీలించారు. నగర ప్రజలు సాయంత్రం వేళలో సేదతీరేందుకు చెరువుకు ఆనుకుని రోడ్డువైపు వాకింగ్ ట్రాక్ తదితర ఏర్పాట్లు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఇన్నర్‌రింగ్ రోడ్డు, భూసేకరణ పురోగతి, గుండు చెరువు, నిర్వాసితులకు పరిహారం చెల్లింపు తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఏకవీరదేవి దేవాలయంలోని పెండింగ్ పనులు ఈనెల 27వ తేదీలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ విజయలక్ష్మి, ఇరిగేషన్ ఎస్‌ఈ రాంప్రసాద్, ఈఈ కిరణ్‌కుమార్, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ స్వామి, జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీనివాస్‌రావు, గౌతమ్‌రెడ్డి, సత్యపాల్‌రెడ్డి, అజిత్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



ఉర్సు రంగసముద్రం చెరువును పరిశీలిస్తున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద, అధికారులు

వార్డెన్‌పై కలెక్టర్ ఆగ్రహం

వరంగల్ చౌరస్తా: రెసిడెన్షియల్ ఆవరణలో వరద నీరు నిల్వ ఉండటం, అంతర్గత లైటింగ్ లేకపోవడం, మెనూ పాటించకపోవడంతో వార్డెన్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం వరంగల్ యాకుబ్‌పురలోని ప్రభుత్వ కాలేజీ ఆఫ్ ఎక్సలెన్స్ బాలుర ఎస్టీ హాస్టల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాల, స్టోర్ రూం, మరుగుదొడ్లు, వంట సరుకులను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా..అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశిస్తూ ఏమైన సమస్యలు ఉంటే నేరుగా పెట్టెలో వేయాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం నూతనంగా ప్రారంభించిన డార్మెటరీ షెడ్‌ను పరిశీలించారు. కలెక్టర్ వెంట డీటీడీఓ సౌజన్య, డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ వీరభద్రం, డీసీఓ సురేందర్, ప్రిన్సిపాల్ హేమంత్, వైస్ ప్రిన్సిపాల్ మధు, ఉపాధ్యాయులు ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్

హన్మకొండ: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని వడ్డేపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ, గర్భిణులు, బాలింతల నమోదు, ఔషధాల నమోదు రిజిస్టర్లను పరిశీలించారు. రికార్డుల్లో సమగ్ర వివరాలు నమోదు చేయకపోవడంతో సిబ్బందిని మందలించారు. పలు విభాగాల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ టెక్నీషియన్ అందుబాటులో లేకపోవడంపై కలెక్టర్ ఆరా తీయగా తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్‌కు డిప్యుటేషన్‌పై పంపించినట్లు డీఎంహెచ్‌ఓ అప్పయ్య తెలిపారు. రోగులకు వైద్య పరీక్షలు ఎలా చేస్తున్నారని కలెక్టర్ ప్రశ్నించగా వారంలో రెండు రోజులపాటు (సోమ, శుక్రవారం) స్టాఫ్‌నర్స్ ద్వారా రక్త నమూనాలు సేకరించి తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్‌కు పంపిస్తున్నట్లు ఆయన వివరణ ఇచ్చారు. అదేవిధంగా వడ్డేపల్లిలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శాశ్వత భవన నిర్మాణ పనులు కలెక్టర్ పరిశీలించి త్వరగా పూర్తిచేయాలని సూచించారు. కలెక్టర్ వెంట హనుమకొండ తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, వడ్డేపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మాలిక, సిబ్బంది ఉన్నారు.



పట్టణ ఆరోగ్య కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్



దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్‌ఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

వైఎస్ రాజశేఖరరెడ్డికి ఘన నివాళి

హన్మకొండ చౌరస్తా : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతిని పురస్కరించుకుని హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పలువురు కాంగ్రెస్ నేతలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాల రూపంలో ప్రజల మనసులో చిరస్థాయిగా నిలిచిన మహానేత వైఎస్‌ఆర్ అని కొనియాడారు. ఆయన చూపిన ప్రజా సంక్షేమ మార్గంలో కాంగ్రెస్ పార్టీ నేటికి కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాసరావు, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, మామిండ్ల రాజు, విజయశ్రీ, నాయకులు నాయిని లక్ష్మారెడ్డి, ఎస్.కుమార్‌యాదవ్, నసీం జాహన్, రహమున్నీసా, జాఫర్ పాల్గొన్నారు.

13న లోక్ అదాలత్

వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీవీ నిర్మలా గీతాంబ

వరంగల్ లీగల్ : జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 13న లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ బీవీ నిర్మలా గీతాంబ తెలిపారు. మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా సదన్ బిల్డింగ్‌లో మొదట వరంగల్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు, ఇన్సూరెన్స్, చిట్‌ఫండ్, బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం వరంగల్ జిల్లా వివిధ న్యాయమూర్తులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీపడదగు క్రిమినల్, సివిల్, వివాహ /కుటుంబ తగాదా, మోటార్ వెహికల్ యాక్ట్, బ్యాంకు, చిట్‌ఫండ్, ఎక్సైజ్, ఎలక్ట్రిసిటీ సంబంధ కేసులు, ఇతర కేసులు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కోర్టుల్లో లేని కేసులను ప్రీ - లిటిగేషన్ ద్వారా న్యాయసేవాధికార సంస్థలో పరిష్కరించుకోవాలని సూచించారు. ఈనెల 1 నుంచి వరంగల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రీ లోక్ అదాలత్ ప్రారంభించినట్లు తెలిపారు. ఇందులో కక్షిదారుల కేసును ఇరుపక్షాల అంగీకారంతో రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవడానికి సులభతరం అవుతుందన్నారు. సమావేశంలో కో ఆపరేటివ్ సొసైటీ ట్రిబ్యునల్ కోర్టు చైర్మన్, న్యాయమూర్తి నారాయణ బాబు, వరంగల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయికుమార్, వరంగల్ జిల్లా న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వలుస సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీవీ నిర్మలా గీతాంబ

నగరాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం..

ఆలిండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్ల సమావేశంలో మేయర్ సుధారాణి



సమావేశంలో నగర మేయర్ గుండు సుధారాణి (రౌండప్‌లో)

వరంగల్ అర్బన్ : వరంగల్ నగరాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నట్లు మేయర్ గుండు సుధారాణి తెలిపారు. హరియాణాలోని కర్నాల్‌లో మంగళవారం నిర్వహించిన ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ (ఏఐసీఎం) 53వ వార్షిక సర్వసభ్యసమావేశంలో మేయర్ మాట్లాడారు. వరంగల్ నగరం యునెస్కో గ్లోబల్ నెట్‌వర్క్ ఆఫ్ లెర్నింగ్ సిటీస్‌లో ఎంపికైందని తెలిపారు. మామునూరు విమానాశ్రయం ఏర్పాటు కల త్వరలో సాకారం కానుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 3–10 లక్షల జనాభా కేటగిరీలో వరంగల్ 3వ అత్యంత వేగంగా అభివృద్ధి చెందే నగరంగా నిలిచిందన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో దేశంలో 42వ స్థానం, తెలంగాణలో 2వ స్థానంలో ఉందని ఆమె వివరించారు.

‘మీ మొక్కతో వరంగల్ నగర భవిష్యత్’

బల్దియా కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్

వరంగల్ అర్బన్: భవిష్యత్ తరాలకు చక్కని జీవితాన్ని ఇవ్వాల్సిన బాధ్యత నగరపౌరులపై ఉందని, ‘మీ మొక్కతోనే వరంగల్ నగర భవిష్యత్’ అనే నినాదంతో ముందుకు సాగాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. ఉద్యాన విభాగ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. కేర్ అండ్ క్యూర్ ఆధ్వర్యంలో ‘నగరాన్ని పచ్చదనం చేద్దాం’ అనే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో (సీఎస్‌ఆర్) భాగంగా బల్దియా పరిధిలో ఉన్న ఓపెన్ గ్రీన్ ల్యాండ్స్‌లో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని కోరారు. తల్లి, తండ్రి ఎవరైనా మరణిస్తే వారి పేరుతో స్మృతివనం ఏర్పాటు చేసి మొక్కలు నాటించనున్నట్లు తెలిపారు. అనంతరం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో సీహెచ్‌ఓ రమేశ్, హెచ్‌ఓ లక్ష్మారెడ్డి, కేర్ అండ్ క్యూర్ వ్యవస్థాపక కార్యదర్శి ఆచార్య వెలుదండి రవి పాల్గొన్నారు.

మహబూబాబాద్: శనిగపురంలో యూరియా పంపిణీ కేంద్రం వద్ద టోకెన్ల కోసం బారులుదీరిన రైతులు, గూడూరు పీఏసీఎస్‌లో టోకెన్లు తీసుకుని బారులుదీరిన అన్నదాతలు





నెక్కొండ: మండల కేంద్రంలో అన్నదాతల క్యూ


రాయపర్తి పీఏసీఎస్‌లో బారులుదీరిన రైతులు


వెంకటాపురం(ఎం) పీఏసీఎస్ ఎదుట..

ఇంకా పడిగాపులే..

అన్నదాతలను యూరియా కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. కొద్ది రోజుల నుంచి అందజేస్తున్న ఇంకా సరిపోవడం లేదు. ఫలితంగా పలు పీఏసీఎస్‌లు, ఫర్టిలైజర్ షాపుల వద్ద బారులుదీరుతున్నారు. చెప్పులు, ఆధార్ కార్డులు క్యూలో పెడుతూ పొద్దంత పడిగాపులు కాస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో ఆందోళనలు, రాస్తారోకోలు చేస్తూ రోడ్లపై బైఠాయిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం కూడా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆయా చోట్ల యూరియా కోసం బారులుదీరారు. అలాగే, రహదారులపై ఆందోళనలు చేపట్టారు. సరిపడినంతా యూరియా అందజేయాలని డిమాండ్ చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్

గార్ల పీఏసీఎస్ ఎదుట చెప్పులను క్యూలో పెట్టిన రైతులు




ఖిలా వరంగల్ రైతు సొసైటీ వద్ద యూరియా కోసం బారులుదీరిన రైతులు


శివునిపల్లిలో హాకా సెంటర్ వద్ద..


రేగొండ ఆగ్రోస్ ఎదుట ..


జనగామ: పట్టణంలోని హాకా ఫార్మర్ సొసైటీ వద్ద..

నేడు మల్లన్నగండి కుడికాల్వ ప్రారంభం

- హాజరుకానున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి



స్టేషన్‌ఘన్‌పూర్: దేవాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన గండి రామారం రిజర్వాయర్ (మల్లన్నగండి) కుడి కాల్వ ప్రారంభంతోపాటు పంట పొలాలకు సాగునీరు అందించే కార్యక్రమాన్ని నేడు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవతో రెండు మండలాల పరిధిలోని 11 గ్రామాల్లో 5,600 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 14 కి.మీ పొడవుతో రూ.29 కోట్ల వ్యయంతో నిర్మించిన కాల్వ ప్రారంభోత్సవం, నీటి విడుదల చేయనున్నట్లు తెలిపారు. కాగా, ఎమ్మెల్యే కడియం శ్రీహరి చొరవతో ఎట్టకేలకు సాగునీటి సమస్య పరిష్కారం కానుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యూరియా వచ్చేసింది..

- ఉమ్మడి జిల్లాకు 1,336.050 మెట్రిక్ టన్నులు
- జిల్లాలకు సర్దుబాటు చేసిన అధికారులు

ఖిలా వరంగల్: కోరమండల్ కంపెనీకి చెందిన సీఐఎల్ యూరియా మంగళవారం వరంగల్ గూడ్స్ షెడ్‌కు చేరింది. డిమాండ్ ఉన్న ప్రాంతాలకు యూరియా పంపించేందుకు వ్యవసాయ అధికారులు సర్దుబాటు చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు 1,336.050 మెట్రిక్ టన్నుల యూరియా చేరగా మార్క్‌ఫెడ్‌కు 60 శాతం, ప్రైవేట్ డీలర్లకు 40 శాతం కేటాయించారు.

రూ. 3.81 కోట్ల విలువైన గంజాయి పట్టివేత

నలుగురు అరెస్ట్, మరో నలుగురు పరార్

- వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం: వరంగల్ జిల్లా ఖానాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిలుకలగుట్ట దగ్గర భారీ ఎత్తున గంజాయిని పట్టుకున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఏపీ, ఒడిశా రాష్ట్రాల నుంచి కర్ణాటకకు సరఫరా చేయడానికి గంజాయి సిద్ధంగా ఉందనే సమాచారం మేరకు ఖానాపురం, వరంగల్ డ్రగ్ కంట్రోల్ టీం సంయుక్తంగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుల నుంచి రూ.3,81,92,250 విలువైన 763 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్ట్ చేయగా మరో నలుగురు పరారీలో ఉన్నట్లు సీపీ చెప్పారు.

నిందితులు వీరే..

ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా మారేడిమిల్లి మండలం గుంపినగండి గ్రామానికి చెందిన అందాల పాండురెడ్డి, ఒడిశాలోని నిమ్మలపాలెం గ్రామానికి చెందిన గుళ్లారి మునిరాజ్, దులగండి గ్రామానికి చెందిన కొప్పు కోటయ్య, తెలంగాణలోని సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం పోలారంతండాకు చెందిన భూక్య సాయికుమార్, కలిమేల మండలం గుర్రలూరు గ్రామానికి చెందిన రమేశ్, గిల్లమడుగు గ్రామానికి చెందిన మజ్జి కృష్ణ, నిమ్మలపాలెం గ్రామానికి చెందిన నాయిని రమేశ్, బీదర్‌కు చెందిన ప్రకాశ్.

గంజాయిని దాచి..ఆపై పట్టుబడి

నిందితులు పాండు రెడ్డి, గుళ్లారి మునిరాజ్, కొప్పు కోటయ్య, భూక్య సాయికుమార్ వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో మరో ఇద్దరు నిందితులు రమేశ్, మజ్జి కృష్ణ గంజాయి అమ్ముతున్నారని తెలుసుకుని వారితో పరిచయం పెంచుకున్నారు. అనంతరం రమేశ్, మజ్జి కృష్ణ ఆదేశాల మేరకు గంజాయిని వాహనాల్లో వారు చెప్పిన చోటుకు చేర్చేవారు. దీనికి రూ.వెయ్యి చొప్పున కూలి కట్టించేవారు. ఇందులో భాగంగా గత నెల 28న నిందితులు పాండు, మునిరాజ్, కోటయ్య, రమేశ్ కలిసి తులసిపాక నుంచి నంబర్‌లేని ఆటో ట్రాలీలో గంజాయి తీసుకుని భద్రాచలం, ఇల్లందు మీదుగా వరంగల్ బయలుదేరారు. ఈ క్రమంలో పాకాల దాటిన తర్వాత పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నట్లు గమనించిన నిందితులు ఈ విషయాన్ని కృష్ణకు చేరవేశారు. దీంతో అతడి ఆదేశాల మేరకు చిలుకలగుట్టపై గంజాయి బస్తాలు దాచి వెళ్లిపోయారు. అనంతరం ఈనెల 1న సాయికుమార్.. గంజాయి కొనుగోలు చేసే వ్యక్తిని తీసుకొస్తున్నాడని రమేశ్ ఫోన్ ద్వారా మనిరాజ్, కోటయ్య, మజ్జి కృష్ణకు చెప్పాడు. గంజాయి బస్తాలను కిందికి గుట్ట నుంచి దించుతుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని 23 గంజాయి బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. సాయికుమార్, మనిరాజ్, కోటయ్య, మజ్జి కృష్ణను అరెస్ట్ చేయగా పాండురెడ్డి, ఎన్. రమేశ్, ప్రకాశ్, రమేశ్ పరారయ్యారని సీపీ తెలిపారు. పెద్ద మొత్తంలో గంజాయిని పట్టుకున్న పోలీస్ అధికారులను సీపీ అభినందించి రివార్డులు అందజేశారు. ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, ఎస్‌బీ ఏసీపీ జితేందర్‌రెడ్డి, నర్సంపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సతీశ్ పాల్గొన్నారు.


నిందితుల అరెస్ట్ చూపుతున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్


నగదు రివార్డు అందుకుంటున్న ఎస్‌బీ ఏసీపీ డాక్టర్ జితేందర్‌రెడ్డి

సీఓఈల్లో ప్రవేశానికి నేడు పరీక్ష

న్యూశాయంపేట : సీఓఈ (సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ) కళాశాలల్లో ప్రవేశానికి నేడు(బుధవారం) పరీక్ష నిర్వహించనున్నారు. వరంగల్ రంగశాయిపేట శివారు జక్కలొద్ది బాలుర గురుకులంలో బాలురు, కేయూ క్రాస్‌రోడ్‌లోని బాలికల గురుకులంలో బాలికల కోసం పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న గురుకులాల నుంచి ఐఐటీ కోచింగ్ కోసం 75, నీట్ కోసం 31 మంది మొత్తం 106 మంది బాలురు దరఖాస్తు చేసుకున్నారు. బాలికలు ఐఐటీ ప్రత్యేక కోచింగ్ 64, నీట్ కోసం 89 మంది బాలికలు మొత్తం 153 మంది బాలికలు దరఖాస్తు చేసుకున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ జంగా సతీశ్ తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి 3.30 వరకు జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

మంత్రుల కాన్వాయ్ అడ్డగింత


బీఆర్‌ఎస్ కార్యకర్తలను పక్కకు నెట్టిన పోలీసులు


సత్యవతిరాథోడ్, కవితను అడ్డుకుంటున్న పోలీసులు

- మాజీ మంత్రి, మాజీ ఎంపీ రోడ్డుపై బైఠాయింపు
- కాళేశ్వరంపై సీబీఐ విచారణను ఉపసంహరించుకోవాలి

కురవి: రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు విచారణను సీబీఐకి అప్పగించడాన్ని నిరసిస్తూ మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మాజీ ఎంపీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత ఆధ్వర్యంలో మంగళవారం మహబూబాబాద్ జిల్లా కురవిలోని 365 జాతీయ రహదారిపై మంత్రుల కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. మంత్రులు దామోదరరాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డి మానుకోటలో మెడికల్ కాలేజీ భవన సముదాయాన్ని ప్రారంభించేందుకు మరిపెడ నుంచి కురవి మీదుగా జిల్లా కేంద్రానికి వస్తున్నారు. ఈ క్రమంలో మాజీ మంత్రి, మాజీ ఎంపీ.. పార్టీ శ్రేణులతో కలిసి కురవిలోని 365 జాతీయ రహదారి వద్దకు చేరుకున్నారు. దీంతో మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, రూరల్ సీఐ సర్వయ్య గమనించి మాజీ మంత్రి సత్యవతిరాథోడ్‌తో పలుమార్లు మాట్లాడి ధర్నా విరమించుకుని సహకరించాలని సూచించగా ససేమిరా అన్నారు. ఈ క్రమంలో మంత్రుల కాన్వాయ్ కురవికి చేరుకున్న సమయంలో కార్యకర్తలు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. దీంతో మాజీ మంత్రి, సత్యవతి, మాజీ ఎంపీ కవిత రోడ్డుపై బైఠాయించారు. ఈ సమయంలో మంత్రుల కాన్వాయ్ ధర్నా ప్రదేశానికి చేరుకుంది. దీంతో స్పెషల్ పార్టీ పోలీసులు రోప్ సాయంతో కాన్వాయ్‌ను మానుకోట వైపునకు పంపించారు.

చంద్రబాబు కళ్లల్లో ఆనందం చూసేందుకు..

ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్, మాలోత్ కవిత మాట్లాడుతూ.. కాళేశ్వరం నీరును ఆంధ్రాకు పంపించి ఏపీ సీఎం చంద్రబాబు మెప్పుపొందేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి తన గురువు చంద్రబాబు కళ్లల్లో ఆనందం చూసేందుకు కాళేశ్వరంపై విషం కక్కుతున్నారని మండిపడ్డారు. కాళేశ్వరాన్ని ఎండబెడితే బనకచర్లకు లాభం జరుగుతుందనే ఉద్దేశంతో సీఎం రేవంత్ సైకోలా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిచ్చిరెడ్డి, లాలయ్య, రవినాయక్, భరత్, రాంచంద్రయ్య, మల్లికార్జున్, రమేశ్ పాల్గొన్నారు.

అన్నారంలో రెండోరోజు ఏడీసీపీ సర్వే

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం(సరస్వతీ) బరాజ్‌లో ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు పుణెకు చెందిన సీడబ్ల్యూపీఆర్‌ఎస్ సీనియర్ సైంటిస్టులు డాక్టర్ సంపత్ శ్రీకాంత్, నాగరాజు ఆధ్వర్యంలో ఏడీసీపీ (అకౌస్టిక్ డాప్లర్ కరంట్ (ప్రొఫైలర్) సర్వేను రెండు రోజులుగా చేస్తున్నారు. మంగళవారం బరాజ్‌లోని నీటి పరిమాణం, లోతును అంచనా వేశారు. బరాజ్‌లోకి 2.30లక్షల క్యూసెక్కుల నీరు ఎగువనుంచి తరలివస్తోంది. వారి వెంట డీఈఈ రవిచంద్ర తదితరులు ఉన్నారు.


అన్నారం బరాజ్‌లో ఏడీసీపీ సర్వే చేస్తున్న సైంటిస్టులు

గుత్త మేస్త్రీ దారుణ హత్య..

- బ్యాంకుకు వెళ్లొస్తానని హత్యకు గురైన మహిళ
- రోడ్డు పక్క నీటి గుంతలో తేలిన మృతదేహం
- పురుషోత్తమాయగూడెం శివారులో ఘటన..
- ఉల్లెపల్లికి చెందిన మహిళగా గుర్తింపు


వెంకటమ్మ (ఫైల్)

మరిపెడ రూరల్: మహిళా వ్యవసాయ కూలీల గుత్త మేస్త్రీ దారుణ హత్యకు గురైంది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం శివారులో చోటు చేసుకుంది. స్థానికులు, మరిపెడ సీఐ రాజ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని ఉల్లెపల్లికి చెందిన మహిళా వ్యవసాయ కూలీల మేస్త్రీ బంటు వెంకటమ్మ (55) సోమవారం మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకులో పని చూసుకుని, ఖమ్మం జిల్లా తిరుమలయపాలెం మండలం ఎర్రగడ్డ గ్రామంలో డబ్బులు తీసుకురావడానికి వెళ్లింది. అనంతరం సాయంత్రం నాలుగు గంటల సమయంలో తన కూతురు ఉపేంద్రకు ఫోన్ చేసి తాను ఇంటికి వస్తున్నానని, తమ్ముడు నరేశ్‌ను బైక్ తీసుకుని పురుషోత్తమాయగూడెం స్టేజీ వద్దకు రమ్మని చెప్పింది. కుమారుడు స్టేజీ వద్దకు వచ్చి తల్లి వెంకటమ్మకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. కొంత సమయం వేచి చూసి కుమారుడు తిరిగి ఇంటికి వెళ్లిపోయాడు. మంగళవారం పురుషోత్తమాయగూడెం గ్రామానికి చెందిన ఓ రైతు పొలం వద్దకు వెళ్తున్న క్రమంలో జోగులపాడు రహదారిలో నీటి గుంతలో సదరు మహిళ మృతదేహం తేలి ఉంది. ఈ విషయం తెలుసుకున్న మృతురాలి కుమార్తె ఉపేంద్ర ఘటనాస్థలికి చేరుకుని తల్లిగా గుర్తించింది. మృతదేహం సమీపంలోని రహదారిలో రక్తపు మరకలు, పగిలిన గాజులు, మద్యం బాటిళ్ల లేబుల్స్ ఉన్నాయి. సదరు మహిళను దుండగులు చున్నీతో ఉరేసి గొంతులో పొడిచి హత్యచేశారు. అనంతరం ఈడ్చుకెళ్లి నీటి గుంతలో పడేసిన ఆనవాళ్లు ఉన్నాయి. ఘటనాస్థలికి మరిపెడ సీఐ రాజ్‌కుమార్ చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతురాలు కుమారుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతురాలికి భర్త లింగయ్య, కుమారుడు, కూతురు ఉంది.

గుంతలోపడి రైతు మృతి


శంకర్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్: గుంతలోపడి ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి మహబూబాబాద్ మండలం కేవులతండా గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అజ్మీరా శంకర్(45) రాత్రి సమయంలో బహిర్భూమికి వెళ్లాడు. ఈ క్రమంలో రోడ్డు పక్కనే ఉన్న గుంతను గమనించక ప్రమాదవశాత్తు అందులో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య బుల్లి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మంత్రి దామోదరకు సమస్యల ఏకరువు..

- వైద్య విద్యార్థులతో మంత్రి ముఖాముఖి

నెహ్రూసెంటర్: రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వైద్య విద్యార్థులు సమస్యల ఏకరువు పెట్టారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్, నర్సింగ్ కళాశాల హాస్టళ్ల భవనాలు ప్రారంభించిన అనంతరం మంత్రి రాజనర్సింహ.. వైద్య విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాలలో అందుతున్న సౌకర్యాలు, కల్పించాల్సిన వసతులను వివరించారు. కాగా, విద్యార్థులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించి నాణ్యమైన వైద్య విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రులు తెలిపారు.


మంత్రులకు సమస్యలను వివరిస్తున్న వైద్య విద్యార్థిని

రవాణా సౌకర్యం లేక ఇబ్బంది..



మెడికల్ కళాశాల నుంచి ప్రభుత్వ ఆస్పత్రి, హాస్టళ్లకు వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నాం. అలాగే, కుటుంబ దత్తత ప్రోగ్రాం నిమిత్తం గ్రామాలకు వెళ్లాల్సిన సమయంలో రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాం.

– దమయంతి, వైద్య విద్యార్థిని

ప్రైవేట్ హాస్టళ్లలో ఉంటున్నాం..



హాస్టల్ భవనాలు పూర్తి కాకపోవడంతో ప్రైవేట్ హాస్టళ్లలో ఉంటున్నాం. రోజూ కళాశాల నుంచి ఆస్పత్రి, హాస్టళ్లకు 15 కిలో మీటర్ల మేర నడవాల్సి వస్తోంది. థర్డ్ ఇయర్ చదువుతున్నాం. హాస్టళ్ల ఏర్పాటు చేస్తే పీజీకి ప్రిపేర్ అవుతాం.

– సత్యేంద్ర పాండే, వైద్య విద్యార్థి

గ్రౌండ్ ఏర్పాటు చేయాలి..



కళాశాలలో ప్లే గ్రౌండ్, జిమ్ ఏర్పాటు చేయాలి. విద్యతోపాటు శారీరక ఫిట్‌నెస్ కోసం గ్రౌండ్ ఉపయోగపడుతుంది. విద్యార్థుల ఇంటరాక్టివ్, మీటింగ్ కోసం ఆడిటోరియం ఏర్పాటు చేయాలి. బిల్డింగ్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి.

– ఏహ్తేషామ్, వైద్య విద్యార్థి

నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి..



హాస్టళ్లు, ఆస్పత్రి, కళాశాల బిల్డింగ్‌లు త్వరగా పూర్తి చేయాలి. ట్రాన్స్‌పోర్టు సమస్య పరిష్కరించాలి. స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి. లైబ్రరీ ఏర్పాటుచేసి బుక్స్ అందించాలి. సెంట్రల్ లైబ్రరీ, ఈ–లైబ్రరీ అందుబాటులోకి తీసుకురావాలి.

– అనీషా, వైద్య విద్యార్థిని

కిటెక్స్ కంపెనీలో గార్మెంట్ల తయారీ ప్రారంభం

- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్
- ఎక్స్ వేదికగా సంతోషం

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ–సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ)లో నెలకొల్పిన కేరళకు చెందిన కిటెక్స్ కంపెనీలో గార్మెంట్ల తయారీ ప్రారంభమైందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. మంగళవారం ట్విట్టర్(ఎక్స్) వేదికగా కంపెనీలో ఉత్పత్తి ప్రారంభమైందంటూ సంతోషం పంచుకున్నారు. కేరళ నుంచి కిటెక్స్ కంపెనీని తెలంగాణ(వరంగల్)కు తీసుకురావడం ఇంకా తన కళ్ల ముందే కనిపిస్తోందన్నారు. వాణిజ్య ఉత్పత్తులను ప్రారంభించడంపై కిటెక్స్ కంపెనీ యాజమాన్యానికి, ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్ నాయకత్వం, అవినీతిరహిత పాలనతోనే ప్రతిష్ఠాత్మక కిటెక్స్ సంస్థ తెలంగాణకు వచ్చిందని, భవిష్యత్‌లో రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో ఈ కంపెనీ కీలక భూమిక పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.


కేఎంటీపీలోని కిటెక్స్ కంపెనీ షెడ్‌లు